క్లుప్తంగా

శాస్త్రోక్తంగా శ్రీవేంకటేశ్వర కల్యాణం

- వైభవంగా ద్వితీయ వార్షికోత్సవం



లెక్కలవారిపల్లెలో వైభవంగా శ్రీవారి కల్యాణం

భాకరాపేట: శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు మండల కేంద్రం సమీపంలోని లెక్కలవారిపల్లె గ్రామంలో ఆదివారం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం అంగరంగ వైభవంగా చేపట్టారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు.

వైభవంగా గ్రామ దేవత ఉత్సవాలు



అమ్మవారికి పట్టువస్త్రాలను తీసుకు వెళుతున్న నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురంలో ఆదివారం గ్రామ దేవత శ్రీ అంకాల పరమేశ్వరి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ నేపథ్యంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు చినబాబు, లీలాక్రిష్ణ, వెంకటపతి, దినేష్, ధనుంజయ్, సంజీవి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాపై హెల్ప్‌లైన్ ఏర్పాటు

తిరుపతి తుడా: తాగునీటి కాలుష్యం వలన కలిగే డయేరియా వ్యాధిపై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అలాగే డెంగీ, మలేరియా సమస్యలపై ఫిర్యాదు, సహాయం నిమిత్తం హెల్ప్ లైన్ నంబర్ 0877–2256766ను ప్రారంభించినట్లు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ప్రజలు డయేరియా సంబంధిత ఫిర్యాదులను, ఎక్కడైనా నీరు కలుషితమైనా, తాగునీటిలో మురుగు నీరు కలుస్తున్నట్లు తెలిసినా 24 గంటల పాటు పని చేసే హెల్ప్‌లైన్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని, ఇందుకోసం మూడు షిఫ్టుల చొప్పున తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో సిబ్బందిని నియమించినట్లు తెలిపారు.

నాంచారయ్యకు ఘన సన్మానం



నాంచారయ్యను సత్కరిస్తున్న ఆపస్ నాయకులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు వెస్ట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహించి ఆదివారం ఉద్యోగ విరమణ చేసిన నాంచారయ్యను ఆపస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈఓ శేఖర్, విశిష్ట అతిథిగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ పాల్గొన్నారు. నాంచారయ్యను దుశ్శాలువా, పండ్లు, వాల్మీకి రామాయణం గ్రంథం బహూకరించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తూకివాకం నాగరాజు, గట్ల సాంబిరెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు డాక్టర్ దేవరాజులు, నాయకులు మహేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ కప్ సంబరాలు



తిరుపతి గాంధీ రోడ్: వెస్టిండీస్ వేదికగా శనివారం రాత్రి ఉత్కంఠభరితంగా సాగిన టి–20 క్రికెట్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌లో సౌత్ ఆఫ్రికాపై ఇండియా 7 పరుగుల తేడా గెలిచి కప్ కైవసం చేసుకోవడంతో తిరుపతిలోనూ సంబరాలు మిన్నంటాయి. బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీసు వద్ద వేడుకలు నిర్వహించారు. ప్రజలకు స్వీట్లు పంచారు. బీజేపీ నాయకులు సవిత, సుబ్రహ్మణ్యం రెడ్డి , సుబ్రహ్మణ్యం యాదవ్, దీపక్ యాదవ్, డీఎంకే గణేష్, మల్లారపు రవి ప్రసాద్, స్థానికులు కళావతి, గురునాథ నాయుడు,రమేష్ శెట్టి, చెంగల్ రాయుడు, కామను బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై దాడి



పోలీసు స్టేషన్‌కు చేరుకుని తమ గోడు వెళ్లబోస్తున్న బాధితులు

- అడ్డొచ్చిన మాజీ ఎంపీటీసీ కుమారులను సైతం చితకబాదిన టీడీపీ కార్యకర్తలు

చంద్రగిరి: ఇంటి వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడిన ఘటన మండలంలోని అగరాల పంచాయతీ దళితవాడలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బాధితుల కథనం.. అగరాల దళితవాడకు చెందిన పునీత్ తన ఇంటి వద్ద ఉన్న సమయంలో అదే గ్రామానికి చెందిన కొందరు యువకులు ద్విచక్ర వాహనంతో పునీత్‌ను ఢీకొన్నారు. దీంతో వారిని ప్రశ్నించడంతో ఒక్కసారిగా హర్ష, దిలీప్, రమేష్, సాయి కుమార్, మదన్, రమేష్, సుధీర్‌తో పాటు మరికొందరు అతడిపై విచక్షణ రహితంగా దాడికి పాల్పడ్డారు. దాడిని అడ్డుకోవడానికి వచ్చిన మాజీ ఎంపీటీసీ మురగయ్య కుమారులు ప్రీతమ్, గణేష్‌పై సైతం దాడి చేశారు. మురగయ్య భార్యపై సైతం దాడి చేసి చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో బాధితులు అక్కడ నుంచి ప్రాణభయంతో పరుగులు తీసి స్థానికుల సహకారంతో చంద్రగిరి పోలీసు స్టేషన్‌కు చేరుకుని జరిగిన ఉదంతాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెంటనే రక్షక్ వాహనానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది గ్రామానికి వెళ్లి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి ఉద్దేశపూర్వకంగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సానుభూతిపరులపై దాడులు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా పోలీసుశాఖ చర్యలు తీసుకుని, వీటికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును విచారణ చేస్తున్నారు.

టీటీడీ హెల్త్ విభాగం కార్మికుల ధర్నా



ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

తిరుపతి సిటీ: టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులను యధావిధిగా కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో టీటీడీ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా టీటీడీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు టి సుబ్రమణ్యం, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడారు. టీటీడీ హెల్త్ విభాగం ద్వారా విద్యాసంస్థలలో, తిరుచానూరు, గోవిందరాజ స్వామి టెంపుల్, ఏడీ బిల్డింగ్ తదితర ప్రాంతాలల్లో దాదాపు 20 ఏళ్ల నుంచి సుమారు 570మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరిలో 250మంది కార్మికులను తొలగించాలని టీటీడీ హెల్త్ టెండర్‌లో నిబంధనలు పెట్టడం దారుణమన్నారు. టీటీడీలో దశాబ్దాలుగా పనిచేస్తున్న కార్మికుల కడుపుకొట్టే ప్రయత్నం చేస్తే సహించేది లేదని, ఏ ఒక్క కార్మికుడినైనా విధుల నుంచి తొలగిస్తే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి వర్గ సభ్యురాలు పి బుజ్జి, కార్మికులు పాల్గొన్నారు.

కళలను పరిరక్షించుకుందాం



ద్వితీయ బహుమతి అందుకుంటున్న కళాకారుడు కేశవులు రెడ్డి

తిరుపతి కల్చరల్: అంతరించిపోతున్న కళలను పరిరక్షించి ఆ కళా సంపదను భావితరాలకు అందించి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని టీటీడీ విశ్రాంత డెప్యూటీ ఈఓ చిన్నంగారి రమణ పిలుపు నిచ్చారు. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా సుబ్బరాజు నాట్య కళాపరిషత్ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథిగా ఆయన ప్రసంగించారు. గత 40 ఏళ్లుగా కళావిసానికి కోనేటి సుబ్బరాజు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. నేటి ఆధునిక పోకడల నేపథ్యంలో నాటక కళ కనుమరుగవుతోందని, వీటి పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహపడతాయన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన వారికి నగదుతో పాటు జ్ఞాపికలను అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా వెంకటస్వామి, కేశవులురెడ్డి, ఎర్రమనాయుడు బహుమతులు అందుకున్నారు. వీరితో పాటు ఏడుగురికి ప్రోత్సాహ బహుమతులు అందజేశారు. అనంతరం ప్రదర్శించిన బూడిద సాంఘిక నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో నిర్వాహకుడు కోనేటి సుబ్బరాజు, రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, వెంకటస్వామి, రఘురామ శర్మ, రవీంద్ర, బీఎస్.రావు,కళాకారులు పాల్గొన్నారు.

మలబార్‌లో నువ డైమండ్ ప్రదర్శన

తిరుపతి కల్చరల్: బాలాజీ కాలనీలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన నువ డైమండ్స్ ఆభరణాల ప్రదర్శనను ఆదివారం కస్టమర్లు ప్రారంభించారు. షోరూం హెడ్ రెజీష్ మాట్లాడుతూ, ప్రకృతి ప్రసాదించిన సంక్లిష్టమైన ఆకృతులు, అలలు, వివిధ రూపాలు, మడతలు, అల్లికలు నుంచి ప్రేరణ పొంది అద్భుతంగా రూపొందించిన పలు రకాల వజ్రాభరణాలను ప్రదర్శనలో ఏర్పాటు చేశామన్నారు. ఇవి మహిళలకు గాంభీర్యాన్ని, మరింత అందాన్నిస్తాయని పేర్కొన్నారు. ప్రదర్శనను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సన్మానం



టీటీడీలో ఆఫీస్ సబార్డినేట్‌గా రఘునాథరెడ్డి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు సన్మానించారు.

– తిరుపతి కల్చరల్

సాహిత్యంతోనే సమాజ వికాసం



వెంకటరత్నంను సన్మానిస్తున్న అతిథులు

నెల్లూరు: సాహిత్యంతోనే సమాజ వికాసమని, ఆ దిశగా తమ రచనలు సాగిస్తున్న వారు సమాజ హితులని పలువురు సాహితీవేత్తలు తెలిపారు. నగరంలోని పురమందిరం ప్రాంగణంలోని ఏసీ హాల్‌లో ఆదివారం విశాలాక్షి సాహిత్య మాసపత్రిక 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గత 15వసంతాలుగా విశాలాక్షి సాహిత్య మాసపత్రిక ప్రచురణకర్త కోసూరు రత్నం, సంపాదకుడు ఈతకోట సుబ్బారావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విశాలాక్షి 2024 సాహిత్య పురస్కారాలను వివిధ ప్రాంతాలకు చెందిన రచయితలు, అడిగోపుల వెంకటరత్నం, తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం తదితరులకు అందజేశారు.

రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్

- బీజేపీ నేతల పనులకు అడ్డుపడితే మా దృష్టికి తెండి
- మనం కూడా అధికారంలో భాగమే
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు



మాట్లాడుతున్న జగదీశ్వర్ నాయులు

చంద్రగిరి: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకు అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను దేశ వ్యాప్తంగా జులై 6వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన చంద్రగిరి బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ మునిగంగిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటుతామన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తోందని, సావధానంగా పనులు చేసుకోవాలని, బీజేపీ నాయకులకు పనులు చేయకుండా అడ్డుపడితే జిల్లా పార్టీ దృష్టికి తీసురావాలని సూచించారు. మనం కూడా అధికార పార్టీలో భాగంగా ఉన్నామన్నారు. వచ్చే నెలలో మండల, ఆపై స్థాయి నాయకులతో రాజమండ్రిలో బీజేపీ సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ విశ్వనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, సుబ్రమణ్యం యాదవ్, గాలి పుష్పలత, హరినాథ రెడ్డి, శ్రీధర్‌బాబు, దొరస్వామి, బ్రహ్మం, శంకర్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, ఈశ్వర్,, చండీశ్వర్ రెడ్డి, నవీన్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్, మేఘాలయ చీఫ్ జస్టిస్ వైద్యనాథన్ వేర్వేరుగా కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయం వద్ద వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారి సేవలో గౌతమ్ గంభీర్



తిరుమల: తిరుమల శ్రీవారిని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ ఆదివారం ఉదయం వీఐపీ విరామ సమయంలో స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల గౌతమ్ గంభీర్ మీడియాతో మాట్లాడుతూ, టీ20 వరల్డ్ కప్ విజయంతో 140 కోట్ల భారతీయులను గర్వపడేలా చేసిందన్నారు. రాహుల్ ద్రవిడ్, రోహిత్ శర్మ, టీమ్ ఇండియాకు ప్రత్యేక అభినందనలు చెబుతున్నట్లు తెలిపారు. కోహ్లీ, రోహిత్ శర్మ వరల్డ్ కప్ సాధించి టి20కి రిటైర్మెంట్ ప్రకటించడం చాలా మంచి సందర్భమన్నారు. వన్ డే, టెస్ట్ క్రికెట్లో రోహిత్, కోహ్లీ తమదైన పాత్ర పోషించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

నగరంలో వన్‌వే సూచిక బోర్డులు ఏర్పాటు

- నిబంధనల ఉల్లంఘనులపై 2,493 కేసులు
- చలాన్ల రూపేణా రూ.25.9లక్షలు వసూలు

తిరుపతి గాంధీ రోడ్: జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు నగరంలో వన్ వే ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలలో సూచిక బోర్డులను ఆదివారం ఏర్పాటు చేసినట్లు ట్రాఫిక్ డీఎస్పీ రమణ కుమార్ తెలిపారు. అలాగే ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30 వరకు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నిబంధనలు అతిక్రమించిన వారిపై 2,493 కేసులు నమోదు చేసి, వారి నుంచి చలానా రూపంలో 25,09, 250 రూపాయలు వసూలు చేశామన్నారు. ఇందులో ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మైనర్ బాలురు, సౌండ్ పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్, రాంగ్ పార్కింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్నట్టు వివరించారు.